ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 20 జనవరి 2024

వెంకటగిరిలో జన సునామీ

- టీడీపీ బహిరంగసభకు పోటెత్తిన ప్రజానీకం
- చంద్రబాబుపై శ్రేణుల్లో ఇనుమడించిన అభిమానం
- సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిన జిల్లా పార్టీ నేతలు

వెంకటగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో శుక్రవారం చంద్రబాబు పాల్గొన్న 'రా కదలిరా' బహిరంగసభకు జనం పోటెత్తారు. అధినేత పట్ల శ్రేణుల్లోనూ, ప్రజల్లోనూ అభిమానం, ఆదరణ మరింతగా ఇనుమడించిన వైనం సభలో కళ్ళకు కట్టింది. వెంకటగిరి సెగ్మెంట్ నుంచీ భారీఎత్తున శ్రేణులు తరలి రాగా శ్రీకాళహస్తి, గూడూరు నియోజకవర్గాల నుంచీ కూడా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు సభకు హాజరయ్యారు. ఇక తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మిగిలిన సెగ్మెంట్ల నుంచీ కూడా ఇంఛార్జులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ శ్రేణుల్ని సమీకరించడంతో వెంకటగిరి హెలిపాడ్ వద్ద, పట్టణ ప్రధాన రహదారులతో పాటు బహిరంగసభాస్థలి, పరిసర ప్రాంతాలు కూడా జనంతో నిండిపోయాయి. చంద్రబాబు మధ్యాహ్నం 11.47 గంటలకు హెలికాప్టర్‌లో వెంకటగిరి చేరుకున్నారు. అక్కడ నుంచీ 12.20 గంటలకు సభా వేదికపైకి చేరుకున్నారు. 12.52 గంటలకు ప్రసంగం ప్రారంభించిన ఆయన 1.42 దాకా మాట్లాడారు. ఎండ చురుగ్గా వుండడంతో పాటు ఆకలి వేస్తున్నా పార్టీ శ్రేణులు గానీ, ప్రజలు గానీ బహిరంగసభా ప్రాంగణం నుంచీ కదలలేదు. చంద్రబాబు వేదికపైకి వచ్చినపుడు జనం నుంచీ వచ్చిన స్పందన చూశాక ఆయన పట్ల శ్రేణుల్లో అభిమానం మరింత పెరిగినట్టు అనిపించింది. పలు అంశాలపై నేరుగా శ్రేణులకే ప్రశ్నలు సంధించినపుడు కూడా కార్యకర్తలతో పాటు జనం ఉత్సాహంగా స్పందించి సమాధానాలిచ్చారు. చంద్రబాబు సభాస్థలి నుంచీ వెనుదిరిగే వరకూ జనం వెలుపలికి వచ్చారు. వెంకటగిరి పట్టణ చరిత్రలో ఓ రాజకీయ సభకు ఈ స్థాయిలో జనం హాజరు కావడం విశేషమని స్థానికులు మాట్లాడుకోవడం వినిపించింది. అంచనాలను మించి జనం హాజరు కావడంతో తిరుపతి జిల్లా టీడీపీ నేతలు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.



జిల్లా మారినా జనం రాత మారిందా?

వెంకటగిరిలో బ్రహ్మాండమైన బహిరంగసభలో వేలాదిగా హాజరైన పార్టీ శ్రేణులను, ప్రజలనుద్దేశించి మాట్లాడిన చంద్రబాబు జిల్లా ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ, ప్రజలకు ప్రశ్నలు సంధిస్తూ, వారి నుంచి సమాధానాలు రాబడుతూ ఉత్సాహంగా, ఉద్వేగంగా ప్రసంగించారు. ఆయన ప్రసంగంలోని కొన్ని ముఖ్యాంశాలు ఇవీ...

అప్పుడు.. ఇవి చేశాను

"గతంలో నేను నెల్లూరు, తిరుపతి, చెన్నైలను అనుసంధానించి ఉమ్మడి నెల్లూరు జిల్లాను పారిశ్రామిక హబ్‌గా చేయాలనుకున్నాను. నెల్లూరు జిల్లా దగదర్తిలో విమానాశ్రయం, కృష్ణపట్నం పోర్టు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లాను పారిశ్రామికంగా ఉన్నత స్థాయికి చేర్చాలని ప్రయత్నించాను. తిరుపతిలో ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేశాను. దానివల్ల అక్కడ టీసీఎల్, జోహో, సెల్‌కాన్, కార్బన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీలు అనేకం వచ్చాయి. తిరుపతి సహా తూర్పు ప్రాంతాన్ని ఆటోమొబైల్ హబ్ చేయడానికి చర్యలు తీసుకున్నా. ఫలితంగా అపోలో టైర్స్ వంటి ఆటోమొబైల్ సంబంధ పరిశ్రమలు చాలా ఏర్పాటయ్యాయి. ఏర్పేడు, వెంకటగిరి మధ్య ఐఐటీ, ఐసర్ వంటి అత్యున్నత జాతీయ విద్యా సంస్థలు ఏర్పాటు జరిగింది."

ఇప్పుడు ఇలా దోచేశారు

"ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టిన అనేక పనులు జగన్ ప్రభుత్వంలో ఆగిపోయాయి. ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి రూ. 399 కోట్లతో నేను పనులు మంజూరు చేస్తే కేవలం రూ. 19 కోట్లు ఖర్చు చేశాక పనులు ఆపేశారు. కండలేరు ప్రాజెక్టు పనులు ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో దానిపై ఆధారపడిన తెలుగుగంగ ప్రాజెక్టు కూడా పూర్తి కాకుండా ఆగిపోయింది. గూడూరులో రూ. 4500 కోట్ల విలువైన సిలికా ఇసుకను ఇష్టానుసారంగా అమ్మేస్తున్నారు. ప్రభుత్వం నుంచీ లైసెన్సు పొందిన అసలైన లీజు హోల్డర్లను తరిమేశారు. క్వార్ట్జ్, బెరైటీస్, లేటరైట్, లైమ్ స్టోన్ వంటి మైన్లన్నీ అక్రమ మైనింగ్‌తో కొల్లగొట్టేశారు."

వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైంది. రానున్న ఎన్నికల్లో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాలూ గెలుస్తున్నాం.



వైసీపీ నేతలపై బాబు పంచ్‌లు

ఈ ప్రాంత అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల కోసం గళం విప్పిన ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని సీఎం జగన్ దూరంగా పెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో అధికార పార్టీ ఎమ్మెల్యేల దోపిడీపై ధ్వజమెత్తారు.

- సర్వేపల్లిలో మంత్రి కాకాణి కోర్టు దొంగ. గ్రావెల్ దోపిడీకి పాల్పడిన కాకాణికి ఇపుడు నెల్లూరు జిల్లాను కొనే శక్తి వచ్చేసింది.
- సత్యవేడు ఎమ్మెల్యే ఒట్టి రబ్బర్ స్టాంపు. అతడి నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పెత్తనం సాగుతోంది.
- పెద్దిరెడ్డి మామూలు పుడింగి కాదు. రాష్ట్రంలోని మైన్లన్నింటినీ మింగేసి అరిగించుకోగల శక్తి ఆయనకు ఉంది.
- గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ మైన్లను ప్రసాదం తరహాలో మింగేశాడు. మామూళ్ళ వసూలు కోసం కొడుకును పెట్టాడు. ఆ రూ.4500 కోట్ల సిలికా దోపిడీలో ఎమ్మెల్యే వాటా ఎంతో చెప్పాలి.
- వెంకటగిరికి కొత్త బిచ్చగాడు వచ్చాడు. ఆయన పెన్నా నదిలో ఇసుక దోపిడీకి పాల్పడుతున్నాడు. 150 ఎకరాల్లో సిలికా దోపిడీ చేశాడు. నియోజకవర్గంలో విపరీతంగా భూ కబ్జాలకు పాల్పడుతున్నాడు. పార్టీ ఇంఛార్జిగానే ఇలా బరితెగించే ఆయన ఒకవేళ ఎమ్మెల్యే అయితే ఇంకేం చేస్తాడో ఊహించుకోండి.
- సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇసుక, లిక్కర్, గంజాయి, క్రికెట్ బెట్టింగులు వంటి అక్రమ దందాలకు పాల్పడుతున్నారడు. సీఎం జగన్ విశాఖలో రిషికొండను బోడి చేసిన స్ఫూర్తితో శిరసనంబేడు కొండకు ఈయన గుండు కొట్టాడు.
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు రెడ్డి అవినీతి చూస్తుంటే కళ్లు తిరుగుతున్నాయి. అక్కడ రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగింది. రేణిగుంటను కూతురికి, ఏర్పేడును తమ్ముడికి రాసిచ్చేసి, శ్రీకాళహస్తిని తన సొంతానికి పెట్టుకున్నాడు.
- తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నాస్తికుడు. ఇపుడు దేవుడికే నామాలు పెడుతున్నాడు.

పైరవీల ధర్మారెడ్డి

తిరుమల ఈవో ధర్మారెడ్డిపై కూడా చంద్రబాబు పరోక్ష విమర్శలు చేశారు. శ్రీవారిని అడ్డం పెట్టుకుని పైరవీలతో కేసులు లేకుండా చేసే బాధ్యతను జగన్ ఆ అధికారికి అప్పగించారని ఆరోపించారు. సర్వీసులో ఒక్కసారైనా టీటీడీ ఈవో కావాలని కలలు కనే సీనియర్ ఐఏఎస్‌లకు కూడా ఇవ్వకుండా జగన్ తన కేసుల కోసమే ఆ అధికారిని ఈవోగా నియమించారన్నారు.




గూడూరు, వెంకటగిరికి వరాలు

అధికారంలోకి వచ్చాక గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తా. ప్రతి చేనేత కుటుంబానికీ ఇపుడు వైసీపీ ప్రభుత్వం ఇస్తున్న దానికంటే ఎక్కువ సాయం అందిస్తా. ఆక్వా రైతులకు యూనిట్ ఒకటిన్నర రూపాయి చొప్పున సబ్సిడీ విద్యుత్ అందిస్తా. డక్కిలి మండలంలో ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణాన్ని, అలాగే కండలేరు రిజర్వాయరు పెండింగ్ పనులను, తెలుగు గంగ ప్రాజెక్టు పెండింగు పనులను పూర్తి చేస్తాం. వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీకి అనుబంధంగా స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ ఏర్పాటు చేస్తా. స్వర్ణముఖి నదిపై చెక్‌డ్యాములు, వెంకటగిరి-నాయుడుపేట మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తా.

సభలో ప్రముఖులు : చంద్రబాబు సభలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, రాష్ట్ర మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, బీసీ నాయకుడు మస్తాన్ యాదవ్,వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, సునీల్ కుమార్, నెలవల సుబ్రమణ్యం, సుగుణమ్మ, కంభం విజయరామిరెడ్డి, టీడీపీ ఇంఛార్జులు గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, జనసేన నెల్లూరు, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు మధుక్రాంత రెడ్డి, పసుపులేటి హరిప్రసాద్, వెంకటగిరి జనసేన నాయకులు తోట కృష్ణయ్య, గూడూరు వెంకటేశ్వర్లు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, వూకా విజయకుమార్, వెంపటి మాధవుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిగుస్తున్న ఉచ్చు

- దొంగ ఓట్ల కేసులో మరో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు
- బోగస్ ఓట్ల వెనుక గుర్తు తెలియని వ్యక్తులున్నారంటూ పోలీసులకు కార్పొరేషన్ కమిషనర్ ఫిర్యాదు
- ఫిర్యాదులో ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల పేర్లు
- అసలు సూత్రధారుల పేర్లు బయటకు రాకుండా ప్రయత్నాలు



తిరుపతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దొంగ ఓట్ల కుంభకోణంలో డొంక కదులుతోంది. తొలి వేటు ఐఏఎస్ అధికారి గిరీషా మీద పడగా మలి వేటు ఒక తహసీల్దారు, మరొక డిప్యూటీ తహసీల్దారు మీద పడింది. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల విధుల్లో ఉన్న మిగిలిన అధికారుల మీద కూడా చర్యలు తప్పవనే ప్రచారం జరుగుతోంది.అయితే అసలు సూత్రధారుల పేర్లు బయటకు రాకుండా ఉండేందుకు అప్పుడే ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నట్టు చెబుతున్నారు. అందులో భాగంగానే ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల మీద పోలీసులకు ఫిర్యాదు చేశారని భావిస్తున్నారు. మరోవైపు వైసీపీ నేతల ఆదేశాలకు అనుగుణంగా విచ్చలవిడిగా ఉప ఎన్నికల విధులు నిర్వహించిన పోలీసు అధికారులు ఎన్నికల కమిషన్ కొరడా తమ మీదకు మళ్లక ముందే సర్దుబాటు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉప ఎన్నికల్లో తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో వున్న మూడు అసెంబ్లీ నియోజకవర్గాలైన తిరుపతికి ఆర్వోగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఏఆర్వోగా అర్బన్ తహసీల్దార్ జయరాములు, శ్రీకాళహస్తి ఆర్వోగా గాలేరు-నగరి ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, సత్యవేడు ఆర్వోగా డ్వామా పీడీ చంద్రశేఖర్ వ్యవహరించారు. తిరుపతి కమిషనర్ గిరీషా ఈఆర్వోగా ఉన్నారు. ఆ సమయంలో ఈఆర్వో లాగిన్ నుంచి 34వేల ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ చేసి దొంగ ఓటరు కార్డులను సృష్టించినట్టు ఈసీ గుర్తించింది. దేశంలోనే అతిపెద్ద ఎన్నికల నేరంగా భావించి వెంటనే చర్యలకు ఉపక్రమించింది. ఈఆర్వోగా వ్యవహరించిన ప్రస్తుత అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాను సస్పెండ్ చేసింది. ఆ తర్వాతి వేటు ఉప ఎన్నికల సమయంలో ఏఆర్వోగా పనిచేసి ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఏవోగా ఉన్న అర్బన్ తహసీల్దార్ జయరాములు మీదా, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం పుత్తూరు డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న ఎం. విజయభాస్కర్‌లపై పడింది. ఈ ఇద్దరినీ ఈసీ సస్పెండ్ చేసింది. అప్పట్లో ఎన్నికల విధుల్లో ఉన్న మిగిలినవారి మీద కూడా చర్యలుంటాయనే ప్రచారం జరుగుతోంది. అప్పటి ఆర్డీవో కనకనరసా రెడ్డి పైన కూడా చర్యలు తప్పవనే ప్రచారం సాగుతోంది. అయితే ఉప ఎన్నిక ఓట్ల అవకతవకలతో తనకు సంబంధం లేదని ఆయన మీడియాకు వివరణ ఇచ్చుకున్నారు. అదేవిధంగా తిరుపతికి ఆర్వోగా పనిచేసిన కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డిపై కూడా త్వరలో వేటు పడనున్నట్టు అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది.



సస్పెండైన జయరాములు,విజయభాస్కర్

చిట్టెలుకలను ఇరికించే కుట్రా?

ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఒరిజనల్ ఎపిక్ (ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ)కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేసి, వాటి స్థానంలో నకిలీ ఎపిక్ కార్డులు రూపొందించారంటూ ఈనెల 7వ తేదీన తిరుపతి ఈస్టు పోలీసులకు కార్పొరేషన్ కమిషనర్ హరిత ఫిర్యాదు చేయడం చర్చగా మారింది.ఆ సమయంలో తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతాప నాయక్, సి.శివకుమార్, జి. విజయకుమార్‌లను ప్రాథమికంగా తాను విచారించానని, అయితే వారు తమ పాత్ర ఉన్నట్టు అంగీకరించలేదని హరిత ఫిర్యాదులో పేర్కొన్నారు.సాంకేతికపరమైన పరిజ్ఞానంతో లోతైన విచారణ చేపట్టాలని ఆమె కోరారు కూడా. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐటీ చట్టం మేరకు విచారణకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే ఇదంతా కిందిస్థాయి ఉద్యోగులను బలిపశువులుగా చేసే కుట్రగా కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 34 వేల కార్డులను డౌన్‌లోడ్ చేసేంత సాహసం ఎందుకు చేసి ఉంటారనే ప్రశ్న బలంగా వినిపిస్తోంది. వీరికి పై అధికారుల నుంచి ఒక వేళ ఆదేశాలున్నా.. రాజకీయ నేతల ప్రమేయం లేకుండా జరిగే అవకాశమే లేదంటున్నారు. తిరుపతి కేంద్రంగా ప్రముఖ రాజకీయ నేతల కార్యాలయంలో ఈ దొంగ వ్యవహారం జరిగిందనే ప్రచారం నేపథ్యంలో.. దృష్టి మళ్లించడానికే ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల పేర్లతో హడావుడిగా ఫిర్యాదు చేశారంటున్నారు.

ప్లీజ్.. ప్లీజ్ .. సంతకం పెట్టండి: పోలీసుల వేడుకోలు

తిరుపతి ఉప ఎన్నికల్లో విధులు నిర్వహించిన పోలీసు అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది. జరిగిన అవకతవకలపై తనకేమీ సంబంధం లేదన్నట్టుగా సంతకం చేయమంటూ అప్పటి అలిపిరి సీఐ దేవేంద్రకుమార్ టీడీపీ ఎంపీ అభ్యర్థి పనబాక లక్ష్మిని గురువారం కోరినట్టు చెబుతున్నారు.మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసంలో మీడియా సమావేశంలో పనబాక లక్ష్మి ఉండగా సీఐ అక్కడకు చేరుకుని అభ్యర్థించారని చెబుతున్నారు. ఉప ఎన్నికల వేళ దొంగ ఓట్లు వేసినవారిపై ఆధారాలతో సహా పనబాక లక్ష్మి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆమె ఫిర్యాదులో పేర్కొన్నవారు తమ విచారణలో అసలైన ఓటర్లని తేలిందని అంగీకరిస్తున్నట్టు సంతకం పెట్టాలని సీఐ కోరారని తెలుస్తోంది.దీనిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఆమె, సంతకం పెట్టకుండా తిప్పి పంపారంటున్నారు. మరి కొందరు పోలీసు అధికారులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి వద్దకు పరుగులు తీసినట్టు చెబుతున్నారు. ఎలాగైనా తమను కాపాడాలంటూ వేడుకున్నారని,ఆయన మాత్రం,కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల విషయంలో తానేమీ జోక్యం చేసుకోలేనని తేల్చి చెప్పేశారని తెలుస్తోంది. దీంతో నాయకుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించిన పోలీసులు తల్లడిల్లుతున్నట్టు చెబుతున్నారు.

తాగునీరు, పరిశుభ్రతకు ప్రాధాన్యం

- సీఎస్ జవహర్‌రెడ్డి
- నేటితో ముగియనున్న హెల్త్ విలేజ్ వర్క్‌షాప్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19: గ్రామాల్లో తాగునీరు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. హెల్త్ విలేజ్ అంశంపై పద్మావతి యూనివర్సిటీ వేదికగా చేపట్టిన జాతీయ వర్క్‌షాప్ రెండో రోజైన శుక్రవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. తాగునీరు, పరిశుభ్రత వంటి సమస్యలను గ్రామాలు అధిగమించాలన్నారు. దీనిపై సర్పంచులు దృష్టి సారించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జలజీవన్ మిషన్ ద్వారా ఇప్పటికే ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. స్వచ్ఛ భారత్ ద్వారా ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించి ఓడీఎఫ్ ప్లస్‌లోకి వెళ్లామని తెలిపారు. మురికి కాలువల నిర్మాణం వల్ల పంచాయతీలకు నిర్వహణ భారం ఉంటుందని, భూగర్భ డ్రైనేజీ ద్వారా ఎలాంటి సమస్యా ఉండదని పేర్కొన్నారు. రాష్ట్రంలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తున్నట్టు చెప్పారు. విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ ద్వారా గ్రామీణులకు వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి మాట్లాడుతూ 1.4లక్షల మందికి సచివాలయాల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు అందించామన్నారు. వీరి ద్వారా 88 రకాల ప్రభుత్వ సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. చెత్తతో సంపద సృష్టిస్తున్నామన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ టెలి మెడిసిన్‌లో ఏపీ ముందు వరుసలో ఉందన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచామన్నారు. పంచాయతీరాజ్ స్పెషల్ సీఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య విధానం ద్వారా గ్రామీణ స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మాజీ కార్యదర్శి సునీల్‌కుమార్ మాట్లాడారు. సంక్రమిత వ్యాధుల నివారణ, వైద్య సేవలు, జీవన విధానంలో మార్పులు, కుటుంబ నియంత్రణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, అడిషనల్ సెక్రటరీ సీఎస్ కుమార్, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

చంద్రగిరి, జనవరి 19: సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరుతూ శుక్రవారం చంద్రగిరిలో అంగన్వాడీ వర్కర్లు ర్యాలీ నిర్వహించి టవర్ టవర్ క్లాక్ వద్దవున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 39 రోజులుగా నిరవధిక సమ్మె చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్లు కూడా లేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి వాణిశ్రీ, లక్ష్మి, నాగరాజమ్మ, నాగభూషణమ్మ, లీలా, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భీమవరం అడవుల్లో నిమ్మనపల్లి మండలవాసి ఆత్మహత్య



పానిపూరి శివ (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, జనవరి19: చంద్రగిరి మండలం భీమవరం అడవుల్లో అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలవాసి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. భీమవరం అడవుల్లో ఓ మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కనే ద్విచక్ర వాహనం, పురుగుల మందు డబ్బా ఉంది. పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వాహన నంబరు ఆధారంగా పోలీసులు నిమ్మనపల్లి మండలానికి చెందిన పానిపూరి శివ(49)గా గుర్తించారు. అయితే ఈనెల 11వ తేదిన పానిపూరి శివ కనిపించడంలేదని నిమ్మనపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయాన్ని చంద్రగిరి పోలీసులు నిమ్మనపల్లి పోలీసులు సమాచారం ఇచ్చారు. శనివారం పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేయనున్నారు.

21న కంటి వైద్య శిబిరం

పాకాల, జనవరి 19: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు తెలిపారు. చెన్నై శంకర నేత్రాలయం, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కంటి సమస్యలున్న వారు ఆధార్ కార్డ్‌తో ఉదయం 9 గంటలలోపు శిబిరానికి హాజరు కావాలన్నారు. అవసరమైన వారికి చెన్నై శంకర నేత్రాలయంలో ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. వివరాలకు 8143337722 నంబరులో సంప్రదించాలన్నారు.

సమగ్రంగా కుల గణన చేయండి

భాకరాపేట, జనవరి 19: ప్రభుత్వం చేపట్టిన కుల గణనను సమగ్రంగా చేయాలని ఎంపీడీవో దేవేంద్రబాబు సూచించారు. కులగణనను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబంలోని సభ్యుల వివరాలు, వారి సామాజికత, వృత్తి, పశు సంపద వివరాలను సేకరిస్తున్నామన్నారు.

చంద్రగిరిలో 'గడప గడపకు'

చంద్రగిరి, జనవరి 19: చంద్రగిరి పంచాయతీలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, వైసీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్‌గుప్తా, ఏఎంసీ వైస్ చైర్మన్ చేగు గోవర్ధన్‌గుప్తా, సర్పంచ్ రూపా రామ్మూర్తి, ఎంపీటీసీలు బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీలో క్యూఆర్‌కోడ్ అమలు



సీబీఎస్ రిజర్వేషన్ కౌంటర్‌లో క్యూఆర్ కోడ్ ప్రారంభిస్తున్న అధికారులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(కొర్లగుంట), జనవరి 19: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీలో క్యూఆర్ కోడ్(క్యాష్‌లెస్ పేమెంట్)ను అమల్లోకి తెచ్చారు. క్యూఆర్ కోడ్ అమలు కాని కారణంగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై కొన్ని రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో 'ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లో అమలు కాని డిజిటల్ పేమెంట్స్' అన్న వార్త ప్రచురితమైంది. దీనిపై ఆర్టీసీ ఎండీ, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. గత నెల 21న విశాఖపట్నంలోని ద్వారక బస్టేషన్‌లో క్యూఆర్‌కోడ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ఆదరణ లభించడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలుకు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో తిరుపతి సెంట్రల్ బస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో ఈ విధానాన్ని ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన శిరీష క్యూఆర్‌కోడ్ ద్వారా మొదటి టిక్కెట్‌ను ఈడీ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం డి.రామచంద్రనాయుడు, కంట్రోలర్ తండాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

గాదంకిలో పశువుల పండుగ



పాకాల మండలం మిట్టగాదంకిలో జల్లికట్టులో కోడెల పరుగులు

పాకాల, జనవరి 19: మండలంలోని మిట్టగాదంకిలో శుక్రవారం పశువుల పండుగ నిర్వహించారు. ముందుగా పశువులను ముస్తాబు చేసి గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. కోడెగిత్తల కొమ్ములకు అభిమాన నాయకుల ఫొటోలు, పార్టీ జెండాలు కట్టి వీధుల్లో జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలకు కట్టిన బహుమతులు దక్కించుకోవడానికి యువకులు వాటి వెంట ఉత్సాహంగా పరుగులు తీశారు. పశువుల పండుగ తిలకించడానికి వచ్చిన పరిసర గ్రామాల ప్రజలతో వీధులు కిక్కిరిశాయి.

ఫారం-7 అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరపండి

- జిల్లా అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశం



వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 19 : ఫారం-7 ద్వారా అందిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరిపి తప్పుల్లేని ఓటర్ల తుది జాబితా తయారీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. విజయవాడ నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి జేసీ శుభం బన్సల్ ఈఆర్వోలతో కలిసి హాజరయ్యారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు అందుబాటులో ఉండాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది నియామకం కోసం ఉద్యోగుల డేటాబేస్ తయారీ పూర్తి కావాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, అనుబంధ అధికారులకు శిక్షణ కోసం సమావేశ మందిరాలను ఎంపిక చేయాలన్నారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని చర్యలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు హరిత, కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, నిషాంత్‌రెడ్డి, చంద్రముని, ఎన్నికల తహసీల్దారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'రా కదలిరా' సభకు పసుపులేటి



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హరిప్రసాద్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 19: వెంకటగిరిలో శుక్రవారం జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 'రా కదలిరా' సభకు జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి డాక్టర్ హరిప్రసాద్ హాజరయ్యారు. చంద్రబాబును కలసి సత్కరించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ రాక్షస పాలనతో విసిగిపోయిన ప్రజలకు మంచి జరగాలంటే టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావాల్సిందేనని, అందుకు శాయశక్తుల కృషి చేస్తామని అన్నారు.

వెంకటగిరి సభకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు



నాయుడుపేట, జనవరి 19: వెంకటగిరిలో శుక్రవారం నిర్వహించిన టీడీపీ బహిరంగ సభకు టీడీపీ యువనాయకుడు డాక్టర్ సందీప్,ట్రినిటి సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి చైర్మన్ ఆదవరం నాగూరయ్య భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులను తీసుకు వెళ్లారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు కింగ్‌పిన్ చెవిరెడ్డి

- పులివర్తి నాని ఆరోపణ

చిత్తూరు, జనవరి 19:ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లకు కింగ్‌పిన్ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డేనని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని ఆరోపించారు.మృతులు, దొంగ ఓట్లను ముసాయిదా జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఫారం-6, 7, 8 కింద దొంగ ఓట్లను మంత్రి అండదండలతో స్థానిక ఎమ్మెల్యే చేర్పించారని విమర్శించారు. దొంగ ఓట్లపై కేంద్ర ఎన్నికల కమిషన్‌ను చంద్రబాబు కలిసి ఫిర్యాదు చేశారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కడప, నెల్లూరు జిల్లాల్లో ఎర్రచందనం స్మగ్లర్లకు వైసీపీ అధిష్ఠానం సీట్లను కేటాయించిందని, అలాంటి వారు గెలిచాక ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తారో గమనించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లకు కింగ్‌పిన్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి అని, ఆయన ఆధ్వర్యంలోనే ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎన్నికల ఖర్చులకు నిధులను సమకూర్చుతున్నారని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎర్రచందనం, ఇసుక, మట్టిని దోచుకుని కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారన్నారు. చెవిరెడ్డి దేశంలోనే పేరుగాంచిన ఇండస్ట్రీని చంద్రగిరిలో ఏర్పాటు చేస్తున్నారని, అదే గంజాయి పరిశ్రమ అన్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను బయటపెడతానన్నారు. గతంలో తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో 32వేల దొంగ ఓట్లను చేర్చారని, టీడీపీ, బీజేపీ నాయకుల ఫిర్యాదులతో అప్పట్లో ఈఆర్వోగా ఉన్న గిరీష తోపాటు మరో ముగ్గురిని కూడా కేంద్ర ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిందన్నారు. దొంగ ఓట్లతో గెలిచిన ఎంపీ గురుమూర్తిని కూడా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో దొంగ ఓట్లను చేర్పించిన అధికారులతోపాటు వారిపై ఒత్తిడి తీసుకొచ్చిన స్థానిక ఎమ్మెల్యేలపైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే సీఎం జగన్.. కోడికత్తి శీనును ఎందుకు బెయిల్‌పై విడుదల చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వందలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలను హతమార్చారని, అలాంటి పార్టీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రాత్రనుకున్నారేమో..!



వెలుగుతున్న శ్రీనివాస సేతు వీధి దీపాలు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 19: కొంతకాలంగా నగరంలో పలుచోట్ల వీధి దీపాలు పగలు కూడా వెలుగుతున్నాయి. శుక్రవారం మిట్టమధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండు లోపలికి ఏర్పాటైన ర్యాంపు వీధిలైట్లన్నీ వెలుగుతూనే ఉన్నాయి. దీన్ని గమనించిన ప్రయాణికులు, స్థానికులు దీపాలు ఆపేంత సమయం కూడా లేదా అని చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

మెరుగు పేరుతో మాయ

- వృద్ధ దంపతులను మభ్యపెట్టి ఆరు సవర్ల బంగారం అపహరణ





బాధితురాలు దేవసేనమ్మ - దుండగులు కలిపిన పౌడర్ నీళ్లు

పెళ్లకూరు, జనవరి 19:వృద్ధ దంపతులను మభ్యపెట్టి ఆరు సవర్ల బంగారు సరుడు అపహరించిన ఘటన పెళ్లకూరు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది.చిల్లకూరులో వుంటోన్న వృద్ధ దంపతులు చాగణం శంకరయ్య, దేవసేనమ్మ ఇంటికి శుక్రవారం ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వెండి, రాగి వస్తువులకు మెరుగుపెడతామనడంతో శంకరయ్య రాగి పాత్ర ఒకటి ఇచ్చారు. వారి దగ్గర వున్న రెండు రకాల పౌడర్‌తో ఆ పాత్రను శుద్ధి చేయడంతో తళతళ మెరిసింది. దీంతో ఓ మంగళసూత్రం, కాసులు పొదిగిన ఆరు సవర్ల బంగారు సరుడును వారికి ఇచ్చారు. ఓ పాత్రలో కలిపిన పౌడర్ నీళ్లలో వాటిని వేసిన ఆ వ్యక్తులు ఇంకొంత సేపుంటే మెరుగు బాగా వస్తుందని చెప్పారు.దేవసేనమ్మ ఇంట్లోకి వెళ్లిన సమయంలో శంకరయ్య కన్నుగప్పి పాత్రలో ఉన్న బంగారు సరుడు తీసుకున పారిపోయారు.మోసపోయామని గ్రహించిన దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఊడిపోయిన పింక్ టాయిలెట్ తలుపులు



తిరుపతి(కొర్లగుంట), జనవరి 19 : మహిళల సౌకర్యార్థం సెంట్రల్ బస్టాండ్ అంచులో ఏర్పాటు చేసిన పింక్ టాయిలెట్‌కు తలుపు ఊడిపోయాయి.తలుపులకు వాడిన సామగ్రి నాసిరకంగా ఉండడంతో ప్రారంభించిన అనతి కాలంలోనే పాడైపోయి ఊగుతున్నాయి. దీంతో మహిళలకు అసౌకర్యంగా ఉంటోంది. వెంటనే తలుపు మరమ్మతు చేయాల్సిన అవసరం ఉంది.

టీడీపీ టికెట్ ఆశిస్తున్నా



క్యాలెండర్లను పంచుతున్న బడి సుధా యాదవ్

తిరుపతి రూరల్, జనవరి 19: ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధా యాదవ్ వారం రోజులుగా చంద్రగిరి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా నాయకులను, ప్రజలను కలుస్తున్నారు. తిరుపతి రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ తరపున చంద్రగిరి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నట్టు తెలిపారు. బీసీ ఓటర్లు అధికంగా ఉన్నారని, తాను 20 ఏళ్ళుగా అనేక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నానన్నారు.

తిరుపతికి వెల్‌నెస్ సెంటర్ మంజూరు

తిరుపతి (రవాణా), జనవరి 19: తిరుపతికి వెల్‌నెస్ సెంటర్ మంజూరైంది. కేంద్ర ప్రభుత్వ వర్కింగ్, విశ్రాంత ఉద్యోగులకు తిరుపతిలో ఆరోగ్య కేంద్రం లేదు. సెంట్రల్ గవర్నమెంట్ రిటైర్డ్ అండ్ సర్వింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ కోఆర్డినేషన్ కన్వీనర్లు దామోదరం, రంగయ్య సహకారంతో హెల్త్ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకత గురించి ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వంతో పలు దఫాలు చర్చించారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్‌స్కీమ్ (సీజీహెచ్‌ఎస్) కింద వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. భవనాల పరిశీలనకు హైదరాబాద్ నుంచి సీజీహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మయ్య బృందం తిరుపతికి చేరుకుంది. నగరంలోని బీఎస్ఎన్ఎల్, పద్మావతి ఆస్పత్రి, రుయా, ఈఎస్ఐ ఆస్పత్రులను పరిశీలించింది. ఉన్నతాధికారులతో చర్చించి ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో కేంద్ర ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరీక్షల కోసం బెంగళూరు, చెన్నై తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండాపోతుంది.

రాష్ట్రాభివృద్ధికి శాస్త్రీయ ప్రణాళిక అమలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19: రాష్ట్రాభివృద్ధి కోసం శాస్త్రీయ ప్రణాళిక అమలవుతోందని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి అంశంపై ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తి స్థాయిలో అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న నూతన జాతీయ విద్యా విధానం-2020, నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో సింగిల్ మేజర్ సబ్జెక్టు ఎంపిక వల్ల విద్యార్థులకు ఉన్నత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందన్నారు. హైదరాబాదు సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ రంగారెడ్డి మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో పెరిగిన శారీరక, మానసిక ఆరోగ్య సమస్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఆక్సిజన్ సదుపాయం, నాడు-నేడు, విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం మంచి చర్యలు తీసుకుంటోందన్నారు. తిరుచిరాపల్లె ఐఐఎం ప్రొఫెసర్ కృష్ణమధుమోహన్ మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలను పెంచడం ద్వారా అంతిమంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్, డీన్ ప్రొఫెసర్ అప్పారావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న సీఎస్ జవహర్‌రెడ్డి



తిరుచానూరు, జనవరి 19: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు, టీటీడీ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు సీఎస్ జవహర్‌రెడ్డి దంపతులను వేదాశ్వీచనం చేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు సీఎస్ దంపతులకు దర్శన ఏర్పాట్లు చేశారు.

చేదోడుతో ఎంతో మందికి జీవనోపాధి



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్, జనవరి 19: జగనన్న చేదోడు పథకం ద్వారా ఎంతో మంది జీవనోపాధిని మెరుగు పరుచుకుంటున్నారని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని 19 పంచాయతీలకు చెందిన 300 మంది మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీపురంలో శుక్రవారం ముగింపు సభ నిర్వహించారు. మహిళలకు ఉచితంగా శిక్షణ ఇప్పించిన మహర్షి అభ్యుదయ సేవా సంస్థ (మాస్) అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డిని అభినందించారు కార్యక్రమంలో మాస్ అధ్యక్షుడు జ్ఞానశేఖర్ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకే సోషలిజం పార్టీ



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి(తిలక్ రోడ్), జనవరి 19 : సమ సమాజ స్థాపన కోసం నవ సోషలిజం పార్టీని స్థాపించామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పాకాల ఆనందం తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు, సమానత్వం లభించాలని పార్టీ ఏర్పాటు చేశామన్నారు. మహాత్మాగాంధీ, నేతాజీ, సుభాష్ చంద్రబోస్, అంబేడ్కర్, జ్యోతీరావ్‌పూలే వంటి వారిని ఆదర్శంగా తీసుకుని మంచి లక్ష్యంతో పార్టీ కార్యకలాపాలు సాగేలా కార్యాచరణ చేశామన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సూరిబాబురెడ్డి, రఘుబాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొల్పిన కవి వేమన



వేమనకు నివాళి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 19 : అందరికీ అర్థమయ్యే సరళభాషలో వేమన తన పద్యం ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని, ఆయన పద్యానికి అందరు దాసోహమేనని వక్తలు ఉద్ఘాటించారు. వేమన విజ్ఞాన కేంద్ర కార్యదర్శి మాల్లారపు నాగార్జున ఆధ్వర్యంలో వేమన జయంతి ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం మాట్లాడుతూ మూఢనమ్మకాలు ప్రబలంగా ఉన్న రోజుల్లో సత్యాన్వేషణ ద్వారా రుజువులతో కూడిన అంశాలను బహిర్గతం చేశారన్నారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు వేమన కృషి చేశారన్నారు. మాల్లారపు నాగార్జున మాట్లాడుతూ శ్రమను నమ్మిన, దాని విలువ తెలిసిన వ్యక్తి వేమన అన్నారు. సమసమాజ స్థాపన కోసం పాటుపడిన వ్యక్తని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పత్తిపాటి రమేష్‌నాయుడు, మల్లేశ్వరరావు, నడ్డా నారాయణ, వందవాసి నాగరాజు, మునిరత్నం, ఓ.వీ.రమణ, బాలసుబ్రహ్మణ్యం, చాయా మోహన్, మోహనరాజు, మునిరాజ, మునిలక్ష్మి, మునిరామయ్య, నెమలేటి కిట్టన్న పాల్గొన్నారు.

పద్మావతిదేవి తిరుచ్చి ఉత్సవం



తిరుచానూరు, జనవరి 19: తిరుచానూరులో కొలువైన పద్మావతిదేవికి శుక్రవారం రాత్రి తిరుమాడవాడ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం జరిగింది. వేకువజామున అమ్మవారికి సుప్రభాతసేవ, నిత్య కైంకర్యాలను అర్చకులు నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ, మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడేగార్డెన్‌కు వేంచేపు చేసి అర్చకులు తిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన అమ్మవారు ఊంజల్‌పై కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. అనంతరం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

కఠారి దంపతుల హత్యకేసులో ఇద్దరికి బెయిల్ నిరాకరణ

చిత్తూరు లీగల్, జనవరి 19: దివంగత మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్యకేసులో ఇద్దరు నిందితులకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించింది. కఠారి అనురాధ, మోహన్‌లు 2015 నవంబరు 17వ తేదీన నగరపాలక సంస్థ కార్యాలయంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై చంద్రశేఖర్ అలియాస్ చింటూతోపాటు మరో 22 మందిపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. వీరిలో 18మందికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. మిగిలినవారు ఇప్పటికీ రిమాండ్‌లో ఉన్నారు. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా తాము జైల్లో ఉన్నామని, బెయిల్ మంజూరు చేయాలంటూ ఇదే కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ3 జయప్రకాష్ రెడ్డి, ఏ4 మంజునాథ్‌లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు శుక్రవారం విచారణకు వచ్చింది. పూర్వాపరాలు పరిశీలించాక.. కింది కోర్టులో సాక్షుల విచారణ చివరిదశలో ఉన్నప్పుడు బెయిల్ ఇవ్వడం కుదరదంటూ ఆ పిటిషన్‌ను జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ సుధాన్షు దులియాలు డిస్మిస్ చేశారు.

డీసీసీబీలో వడ్డీపై వడ్డీ మాఫీ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 19: రైతులు తీసుకున్న రుణాలు వాయిదా మీరి ఉంటే వాటిని మార్చి నెలాఖరులోగా చెల్లిస్తే వడ్డీపై వడ్డీ, అపరాధపు వడ్డీ మాఫీ, వడ్డీ రాయితీ పొందే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ రెడ్డెమ్మ ప్రకటించారు. స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు.వడ్డీ మాఫీ కారణంగా బ్యాంకుపై రూ.కోటి అదనపు భారం పడుతుందని, రైతాంగం కోసం దాన్ని మోసేందుకు సిద్ధమన్నారు. రూ.వెయ్యి కోట్ల డిపాజిట్లు సేకరించాలన్న లక్ష్యంలో ఇంతవరకు రూ.850 కోట్లు వృద్ధి సాధించామని చెప్పారు. సీఈవో మనోహర్ గౌడ్ అజెండాలోని అంశాలను సభ్యులకు వివరించారు. బ్యాంకు పరిధిలోని ఉద్యోగుల సర్వీసు రెగ్యులరైజేషన్ అమలు చేయాలని పాలకవర్గం నిర్ణయించిందన్నారు. రైతాంగం నుంచి వస్తున్న అభ్యర్థనలతో సింగిల్ విండోల ద్వారా ఇస్తున్న రుణపరపతిని మరింత పెంచుతున్నట్లు వెల్లడించారు. పాలకవర్గ సభ్యులు, సీడీసీఎంఎస్ అధ్యక్షులు నాగలక్ష్మి, ప్రింటింగ్ ప్రెస్ అధ్యక్షుడు మురళీమోహన్ రెడ్డి, డీసీవో బ్రహ్మానందరెడ్డి, డీఎల్‌సీవో వనజ, సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జి కమిటీ అధ్యక్షులు, బ్యాంకు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

సూత్రధారులపై చర్యలేవీ?

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు - ఓట్ల కుంభకోణంపై టీడీపీ నిరసన

తిరుపతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : బోగస్ ఓట్ల కుంభకోణంలో తిరుపతి ప్రతిష్టను దిగజార్చిన ప్రధాన సూత్రధారులపైనా చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండు చేశారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల తంతుపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ కావడంపై బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేస్తున్న నేపథ్యంలో వెనకుండి నడిపించిన వైసీపీ నేతలపైనా చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం ఆర్టీసీ బస్టాండు వద్దగల అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు నిరసన తెలిపారు. నేతలు పనబాకలక్ష్మి, సుగుణమ్మ, నరసింహ యాదవ్, బొజ్జల సుధీర్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుపతిలో జరిగిన ఎన్నికలను అపహాస్యం చేశారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. అధికార పార్టీ నేతలకు తలొగ్గిన అధికారులకు సరైన గుణపాఠం జరుగుతోందన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడం వలన గందరగోళానికి తెర వేసినట్టు అవుతుందని ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, సత్యవేడు ఇన్‌చార్జి హెలెన్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సురేంద్ర కుమార్, నాయకులు ఆర్సీ మునికృష్ణ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ, బుల్లెట్ రమణ, సూరా సుధాకర్ రెడ్డి, రవినాయుడు, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, రుద్రకోటి సదాశివం, సింగంశెట్టి సుబ్బరామయ్య, తిరుమల కేశవులు, కంకణాల రజినీకాంత్, ఆర్సీ శ్రీనివాసులు, కరాటే చంద్ర, జయరామిరెడ్డి, శాంబోళ హరినాథ్, హేమ, అనిత, రేవతి, భారతి, రాజారాం, విశ్వనాథం, నాగరాజు, రత్నం, కేవి రమణ తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతల నిరసన

● తుది జాబితాకు గడువు పెంచండి : నవీన్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత

తిరుపతి జిల్లాకు సంబంధించి ఈనెల 22వ తేదీ రానున్న ముసాయిదా ఓటరు జాబితాకు మరో 15 రోజులు గడువు పొడిగించాలని కాంగ్రెస్ నేత నవీన్ కుమార్ రెడ్డి ఎన్నికల సంఘాన్ని కోరారు. తిరుపతిలో జరిగిన బోగస్ ఓట్ల వ్యవహారంపై ఎన్నికల సంఘం సీబీఐ విచారణకు ఆదేశిస్తే అసలు సూత్రధారులు దొరుకుతారని తెలిపారు. రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం చిరుద్యోగులు బలిపశువులుగా మారుతున్నారన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

● నేడు రాస్తారోకోకు పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు


అంబేడ్కర్‌కు వినతిపత్రం ఇస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

తిరుపతి (రవాణా), జనవరి 19: అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు సీఎం జగన్ మనసు మార్చాలని కోరుతూ దీక్షా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మహిళల సమస్యలు పరిష్కరించలేని సీఎంకు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు లేదన్నారు. 39 రోజులుగా పోరాటం చేస్తున్న అంగన్వాడీలను పట్టించుకోకుండా వి గ్రహాలను ఆవిష్కరించడం సబబు కాదన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రాస్తారోకోలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం సాయంత్రానికి విధుల్లో చేరకపోతే శనివారం నుంచి కొత్తవారిని తీసుకుంటామని నోటీసులు పంపుతున్నారని, ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జీతాలు పెంచే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, తంజావూరు మురళి, వాసు, అంగన్వాడీలు నాగరాజమ్మ, జయప్రభ, గీత, అలేఖ్య, రోజా, యువరాణి, మహాలక్ష్మి, సుజిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల క్రీడలకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 19 : టీటీడీ ఉద్యోగులకు ఫిబ్రవరి రెండో తేదీ నుంచి నిర్వహించనున్న వార్షిక క్రీడలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్లకిరణ్ బృందం ఇన్‌చార్జ్ ఈవో వీరబ్రహ్మంకు శుక్రవారం విన్నవించారు. పరేడ్ గ్రౌండ్‌లో కాకుండా ఎస్వీహైస్కూల్ మైదానంలో క్రీడలు నిర్వహించాలని కోరారు.

టీటీడీ డిగ్రీ కళాశాలలకు స్వయం ప్రతిపత్తి


మాట్లాడుతున్న జేఈవో సదాభార్గవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19 : టీటీడీ తిరుపతిలో నిర్వహిస్తున్న మూడు డిగ్రీ కళాశాలలు స్వయం ప్రతిపత్తి (అటానమస్ స్టేటస్) పొందినట్లు జేఈవో సదాభార్గవి వెల్లడించారు. తిరుపతి పద్మావతి గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీ, ఎస్జీఎస్ కాలేజీలకు యూజీసీ పదేళ్ల పాటు అటానమస్ హోదా కల్పించిందన్నారు. టీటీడీ పాటిస్తున్న విద్యా ప్రమాణాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ హోదాతో కళాశాలల అభివృద్ధి, ప్రమాణాలు, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడానికి మరింత అవకాశం కలుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు సిలబస్‌లో మార్పు చేర్పులు చేసుకుంటూ విద్యార్థులకు ఉన్నత ఉపాధి అవకాశాలు దక్కించుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం స్వయం ప్రతిపత్తి హోదా పొందిన మూడు డిగ్రీ కాలేజీలు న్యాక్ గ్రేడింగ్ కూడా గతంలోనే పొందినట్టు చెప్పారు. ఈ సమావేశంలో టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి, టీటీడీ విద్యా సలహాదారు డాక్టర్ ఎల్ఆర్ మోహన్‌కుమార్‌రెడ్డి, టీటీడీ చీఫ్ పీఆర్వో డాక్టర్ టి.రవి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. టీటీడీ డిగ్రీ కాలేజీలు స్వయం ప్రతిపత్తి హోదా పొందడం పట్ల టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

తెలుగు భాష గొప్పతనాన్ని చాటిన వేమన


వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి (కలెక్టరేట్), జనవరి 19: తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహాకవి యోగి వేమన అని కలెక్టర్ వెంకటరమణారెడ్డి కొనియాడారు. యోగి వేమన జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీఆర్వో పెంచలకిషోర్ పుష్పాంజలి ఘటించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేమన పద్యాల్లో జీవిత సత్యాలను ప్రజలకు తెలియజేశారని, ఆధునిక పరిశోధనలకు సైతం అవి ఆధారమయ్యాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వేమన పద్యాల గొప్పతనాన్ని తెలుసుకోవాలని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆదర్శంగా నిలవాలని కోరారు. జిల్లా సాంఘిక సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అటవీ, వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 19: అటవీ, వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత అని, వాటికి హాని తలపెడితే చట్టప్రకారం చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అటవీ, వన్యప్రాణుల రక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో వన్య ప్రాణులను, అడవులను సంరక్షించాలన్నారు. డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి మాట్లాడుతూ భూ సంబంధిత, హద్దుల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, రెవెన్యూ వారి సహకారంతో వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పాకాల, చిన్నగొట్టిగల్లు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోందని, ట్రాకర్స్ ద్వారా పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. టీటీడీ సహకారంతో అలిపిరి కాలిమార్గంలో చిరుతల సంచారాన్ని తగ్గించగలిగామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, అదనపు ఎస్పీ విమలకుమారి, డీఎఫ్‌వో వైల్డ్ లైఫ్ సూళ్లూరుపేట శ్యాముల్, ఫ్లయింగ్ స్క్వాడ్ శివకుమార్, సబ్ డీఎఫ్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు అయోధ్య రామయ్య అక్షింతలు


అక్షింతలు అందజేస్తున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్, పొనగంటి భాస్కర్

తిరుపతి (రవాణా), జనవరి 19: అయోధ్యలో ఈనెల 22న రామమందిరాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా శ్రీరామ అక్షింతలను కరకంబాడి రోడ్డులోని వినాయకసాగర్‌లో వాకర్స్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, శ్రీరామదూత పొనగంటి భాస్కర్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దశరథరెడ్డి, కార్యదర్శి బాలాజీనాయుడు, కోశాధికారి శివారెడ్డి, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


జస్టిస్ బీ వరాలే - జవహర్‌రెడ్డి

తిరుమల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి, కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ వరాలే, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, తెలంగాణ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

నేడు ధర్మనిధి ఉపన్యాసం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19: ఎస్వీయూ తెలుగు విభాగంలో నేడు తల్లం పుల్లన్న గుప్త ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు సెనేట్ హాల్లో ప్రారంభం కానుంది. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాయలసీమ నవలా సాహిత్య వైశిష్ట్యం అంశంపై ప్రముఖ సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ప్రసంగించనున్నారని తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ తెలిపారు.

బోగస్ ఓట్ల సూత్రదారులపై చర్యలు తీసుకోండి

తిరుపతి(ఆటోనగర్) జనవరి 19 : రాష్ట్రంలో బోగస్ ఓట్ల సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. అనంతవీధిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఓటర్ల జాబితా తయారీ అంశంలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే దొంగే దొంగ..దొంగా... అన్న చందంగా ఉందన్నారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన ప్రభుత్వ అధికారులు నేతలతో చేతులు కలిపి ఇలాంటి వ్యవహారాలకు పాల్పడడం బాధాకరమన్నారు. బోగస్ ఓట్లను తొలగించి, అందుకు కుట్ర పన్నిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేపు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 19: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమాఖ్య, తిరుపతి బ్రాహ్మణ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బైరాగిపట్టెడలోని శ్రీవైఖానస ఆశ్రమం ఆవరణలో బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తిరుపతి బ్రాహ్మణ సమాజం కార్యదర్శి అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 500మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 60 ఏళ్లు నిండిన బ్రాహ్మణుల షష్టిపూర్తి, 70 ఏళ్లు నిండిన దంపతులకు భీమరథశాంతి, 80ఏళ్లు నిండిన వారికి సహస్ర చందన దర్శన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సంబంధం కుదుర్చుకున్న వారిలో నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసి, ఉచిత వివాహాలు జరిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష్యులు డాక్టర్ చక్రపాణి, రామశర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అప్పటి తిరుపతి కార్పొరేషన్ అధికారులను ఎన్నికల విధుల నుంచి తొలగించాలి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 19 : తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక సమయం(2021)లో కీలక బాధ్యతలు నిర్వర్తించిన అధికారులు ఇప్పటికీ తిరుపతి నగరపాలక సంస్థలో పనిచేస్తున్నారని, వారిని తక్షణం విధుల నుంచి తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతి ఎన్నికల ప్రధాన అధికారి లాగిన్, ఎపిక్ కార్డుల డేటా దుర్వినియోగంపై వారు శుక్రవారం ఏఎస్పీ వెంకటరావుకు ఫిర్యాదు చేశారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ 2021 నుంచి తిరుపతి నగరపాలక సంస్థలో క్రియాశీలకంగా పనిచేస్తున్న అధికారుల లాగిన్‌లు ఈ ఎన్నికల్లోనూ దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించేందుకు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ఆధారాలతో సహా ఈ విషయాలన్నింటినీ జాతీయ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. 2021లో తిరుపతి ఎన్నికల ప్రధానాధికారి లాగిన్ ఐడీని దుర్వినియోగం చేసింది ఎవరు....ఎవరి ప్రయోజనాల కోసం చేశారు అనే అంశాలను బహిర్గతం చేయాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌లో నిజాయితీ ఉంటే ఈ వ్యవహారంలో సీబీఐ విచారణ కోరాలని డిమాండ్ చేశారు.నాటి తిరుపతి ఎన్నికల ప్రధానాధికారి, సహ అధికారులు, ఉద్యోగులు, అధికార పార్టీ నాయకులు కూడబలుక్కుని ఈ అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ప్రధానంగా ఈ అంశంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉందన్నారు. అయితే అసలైన నిందితులను తప్పించి ఉద్యోగులను బలిచేసేందుకు తెరవెనుక ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోపించారు. అసలైన నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మునిసుబ్రహ్మణ్యం, పొనగంటి భాస్కర్, వరప్రసాద్ పాల్గొన్నారు.


ఏఎస్పీ వెంకటరావుకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

కోడికత్తి కేసులో శీనుకు న్యాయమేదీ? : టీడీపీ

తిరుపతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కోడికత్తి కేసులో దళితుడైన శీనుకు ఇప్పటివరకు న్యాయం జరగకపోవడానికి సీఎం జగన్మోహన్ రెడ్డే కారణమని టీడీపీ నేతలు ఆరోపించారు. దళితులపై సీఎం కపట ప్రేమ చూపిస్తున్నారంటూ శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. నాయకులు పనబాక లక్ష్మి, సుగుణమ్మ, కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కోడికత్తి పోటు చూపించి ఎన్నికల్లో సానుభూతి పొందిన జగన్ రెడ్డి, దానికి కారణమైన శీనును మాత్రం జైలులో మగ్గేలా చేస్తున్నారని విమర్శించారు. కోర్టుకు హాజరుకాకుండా తల్లిదండ్రులకు శీనును దూరం చేసి, వారి మనోవేదనకు కారణమయ్యారని మండిపడ్డారు. అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రారంభించి, దళితులను ఉద్ధరించేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప నిజమైన దళితులపై దమనకాండ సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దళిత నాయకులు రత్నం, నాగరాజు, రాజారాం, ప్రకాష్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశపరీక్ష

తిరుపతి(విద్య) జనవరి 19 : జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశపరీక్ష శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని అర్బన్ ఎంఈవో బాలాజి పేర్కొన్నారు. తిరుపతిలోని ఎంఆర్‌పల్లె జెడ్పీహెచ్ఎస్, రూరల్ మండలంలో పద్మావతీపురం జెడ్పీహెచ్ఎస్, సత్యవేడులోని జెడ్పీహెచ్ఎస్, శ్రీకాళహస్తిలో బాలుర ఉన్నత పాఠశాల, పుత్తూరులో బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

బలరామిరెడ్డి సేవలు చిరస్మరణీయం

ధర్మనిధి సదస్సులో ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి


రచయిత స.వెం.రమేష్‌ను సన్మానిస్తున్న వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19 : ఎస్వీ యూనివర్సిటీకి బలరామిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ వి.శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన బలరామిరెడ్డి ధర్మనిధి సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యూనివర్సిటీని స్థాపించినప్పటి నుంచి రెండు దశాబ్దాల పాటు బలరామిరెడ్డి సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. సిండికేట్ మెంబర్‌గా, అకడమిక్ సెనేట్ మెంబర్‌గా వర్సిటీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ప్రముఖ రచయిత స.వెం. రమేష్ మాట్లాడుతూ తమిళనాడులో తెలుగు జానపద విజ్ఞానం వ్యాప్తిలో ఉందని చెప్పారు. ప్రస్తుతం తెలుగు జానపద కళలు తమిళనాట సజీవంగా ఉన్నాయని అన్నారు. వేమన పద్యాలు దేవుడి మంత్రాలుగా తమిళ ప్రాంతంలో ఉన్నాయని తెలిపారు. ఎంతో విలువైన ఈ సంపదను సేకరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షుడు ఆచార్య పుట్టా మునిరత్నంరెడ్డి మాట్లాడుతూ బలరామిరెడ్డి స్మారక సంస్థను మాజీ వీసీ జయరామిరెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు పేట శ్రీనివాసులురెడ్డి, గుండ్రె జయచంద్రారెడ్డి, ఆర్ట్స్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాళ్లు పద్మనాభం, కేటీ రామకృష్ణారెడ్డి, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, పెంచల్‌ప్రసాద్, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల మహాసభలను జయప్రదం చేయండి

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 19: నగరంలో ఆదివారం జరిగే ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాభలను జయప్రదం చేయాలని జాతీయ స్కీమ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు రమ కోరారు. బాలాజీకాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.36వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలను వివరించి, మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సంఘం సభ్యులు బసవరాజు, మునీంద్ర, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్య భావజాల రాజకీయాలపై అవగాహన ఉండాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పౌర ప్రజావేదిక నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 19: ప్రస్తుతం నడుస్తున్న ఆధిపత్య భావజాల రాజకీయాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజా చైతన్య వేదిక జిల్లా కార్యదర్శి కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక అసమతుల్యత పెరిగి జీవన సమస్యలు తీవ్రమవుతున్నాయన్నారు. ప్రజల నిరసనలను సహించకపోవడం, ప్రశ్నించే గొంతును నులిమేయడం నిత్య కృత్యమైందన్నారు. విద్వేషాలను పెంపొందించి ఎన్నికల్లో లబ్ధి పొందే ప్రయత్నం సాగుతోందని అభిప్రాయపడ్డారు. వీటిపై అవగాహన కోసం ఈనెల 25న ఎస్వీయూ సెనేట్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న సెమినార్‌కు అందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ, వేదిక సభ్యులు పాల్గొన్నారు.

రామకృష్ణ తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై సమీక్ష

తిరుమల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 25వ తేదీన జరుగనున్న రామకృష్ణ తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో (ఎఫ్ఏసీ) వీరబ్రహ్మం శుక్రవారం సాయంత్రం సమీక్షించారు. తిరుమల గోకులం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమైన రామకృష్ణ తీర్థ ముక్కోటికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టీటీడీ భద్రతా సిబ్బంది, పోలీసులు సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధిక బరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న యాత్రికులను, వృద్ధులను అనుమతించబోమని స్పష్టం చేశారు. గోగర్భం డ్యాం పాయింట్ నుంచి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమీక్షలో ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, వీజీవో గిరిధర్‌రావు, డిప్యూటీ సీఎఫ్ శ్రీనివాసులు, హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుపతి పుస్తక ప్రదర్శన

తిరుపతి (కల్చరల్), జనవరి 19 : భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో 16వ పుస్తక ప్రదర్శన శనివారం నుంచి తిరుపతిలో మొదలు కానుంది. 28వ తేదీ వరకు హరేరామ హరేకృష్ణ మార్గంలోని వినాయకనగర్ మైదానంలో ఈ ప్రదర్శన ఉంటుంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు స్టాల్స్ సందర్శించవచ్చు. రోజూ విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు, పుస్తకాల గురించి ప్రసంగాలు ఉంటాయి. ప్రముఖుల ప్రసంగాలు, సాహిత్య ప్రదర్శనలు ఉంటాయి. పుస్తక ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీవీబీ సంచాలకులు సత్యనారాయణ రాజు కోరారు.

తిరుమలలో బ్రహ్మానందం



తిరుమల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం శ్రీవారి దర్శనార్థం శుక్రవారం తిరుమలకు వచ్చారు. టీఎస్ఆర్ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు అభిమానులు స్వాగతం పలికారు. శనివారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

రేపు 'మట్టి అద్దం' పుస్తకావిష్కరణ

తిరుపతి (కల్చరల్), జనవరి 19 : అభ్యుదయ రచయితల సంఘం (అ.ర.సం) తిరుపతి జిల్లా అధ్యక్షుడు, రచయిత, ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి రచించిన మట్టి అద్దం (కవితా సంకలనం) పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు అ.ర.సం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నెమిలేటి కిట్టన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎయిర్ బైపాస్ రోడ్డులోని యూత్ హాస్టల్ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహితీవేత్తలు హాజరుకావాలని కోరారు.

నేడు 'సిరారంగులు' ఆవిష్కరణ

ఆకాశవాణి విశ్రాంత అధికారి, కవి, రచయిత ఆకుల మల్లేశ్వరరావు రచించిన సిరా రంగులు (హిందీ కవితల అనువాదం) పుస్తకావిష్కరణ సభ శనివారం సాయంత్రం 5.30 గంటలకు బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు డాక్టర్ నాదెళ్ల శ్రీమన్నారాయణ అధ్యక్షత వహిస్తారని, గంగవరపు శ్రీదేవి పుస్తకావిష్కరణ చేస్తారని, డాక్టర్ గాలి గుణశేఖర్ పుస్తక సమీక్ష చేస్తారని పేర్కొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు

తిరుమల, జనవరి19(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 62,649 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,384 మంది తలనీలాలు సమర్పించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి


బాధితురాలు దేవసేనమ్మ, దుండగులు కలిపిన పౌడర్ నీళ్లు

మెరుగు పేరుతో మాయ

● వృద్ధ దంపతులను మభ్యపెట్టి

ఆరు సవర్ల బంగారం అపహరణ

పెళ్లకూరు, జనవరి 19: వృద్ధ దంపతులను మభ్యపెట్టి ఆరు సవర్ల బంగారు సరుడు అపహరించిన ఘటన పెళ్లకూరు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. చిల్లకూరులో వుంటోన్న వృద్ధ దంపతులు చాగణం శంకరయ్య, దేవసేనమ్మ ఇంటికి శుక్రవారం ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వెండి, రాగి వస్తువులకు మెరుగుపెడతామనడంతో శంకరయ్య రాగిపాత్ర ఒకటి ఇచ్చారు. వారి దగ్గర వున్న రెండు రకాల పౌడర్‌తో ఆ పాత్రను శుద్ధి చేయడంతో తళతళ మెరిసింది. దీంతో ఓ మంగళసూత్రం, కాసులు పొదిగిన ఆరు సవర్ల బంగారు సరుడును వారికి ఇచ్చారు. ఓ పాత్రలో కలిపిన పౌడర్ నీళ్లలో వాటిన వేసిన ఆ వ్యక్తులు ఇంకొంత సేపుంటే మెరుగు బాగా వస్తుందని చెప్పారు.దేవసేనమ్మ ఇంట్లోకి వెళ్లిన సమయంలో శంకరయ్య కన్నుగప్పి పాత్రలో ఉన్న బంగారు సరుడు తీసుకున పారిపోయారు.మోసపోయామని గ్రహించిన దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం


హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

వెంకటగిరి టౌన్, జనవరి 19: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా చంద్రబాబు నాయుడికి ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 11.49 నిమిషాలకు వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళశాల మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకున్న చంద్రబాబుకు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆయన సతీమణి సింధు, కుమార్తె లక్ష్మి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు బొలిగల మస్తాన్ యాదవ్, తానంకి నానాజీ, నవజీవన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కాలువపల్లి సహదేవయ్య, జెన్ని రమణయ్య, పట్టాభిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు, పులికల్లు రాజేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర్, పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, మేడికొండ పద్మ మోహన్ నాయుడు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తిరుగు ప్రయాణంలో వెంకటగిరి పట్టణానికి చెందిన పోలిశెట్టి శంకర్‌బాబు పెన్సిల్‌తో గీసిన చంద్రబాబు చిత్రాన్ని ఆయనకు బహూకరించారు.

డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో ఆదినారాయణ

గూడూరు, జనవరి 19: డ్రైవర్లు ప్రతిమూడు నెలలకు ఒక్కసారి తప్పనిసరిగా బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆర్టీవో ఆదినారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక ఆదిశంకర ఇంజనరింగ్ కళాశాలలో రవాణ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లుకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు నిబంధనలు పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారం-7 అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరపండి

జిల్లా అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశం


వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 19: ఫారం-7 ద్వారా అందిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరిపి తప్పుల్లేని ఓటర్ల తుది జాబితా తయారీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. విజయవాడ నుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి జేసీ శుభం బన్సల్ ఈఆర్వోలతో కలిసి హాజరయ్యారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు అందుబాటులో ఉండాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది నియామకం కోసం ఉద్యోగుల డేటాబేస్ తయారీ పూర్తి కావాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, అనుబంధ అధికారులకు శిక్షణ కోసం సమావేశ మందిరాలను ఎంపిక చేయాలన్నారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్వోలు హరిత, కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, నిషాంత్‌రెడ్డి, చంద్రముని, ఎన్నికల తహసీల్దారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.


చంద్రబాబుతో పాశం సునీల్‌కుమార్


చంద్రబాబుతో మాట్లాడుతున్న సోమిరెడ్డి


కురుగొండ్లకు సూచనలిస్తున్న చంద్రబాబు

టీడీపీలో చేరిన రత్నయ్య


రత్నయ్యకు టీడీపీ కండువా కప్పుతున్న చంద్రబాబు

దొరవారిసత్రం, జనవరి 19: దొరవారిసత్రం మండల మాజీ జడ్పీటీసీ ఇట్టగుంట రత్నయ్య టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. శుక్రవారం వెంకటగిరిలో జరిగిన రా.. కదిలి రా.. సభలో నెలవల సుబ్రహ్మణ్యంతో ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. గతంలో టీడీపీలో ఉన్న ఆయన 2019 ఎన్నికల అనంతరం వైసీపీలోకి వెళ్లారు. ప్రస్తుతం తిరిగి స్వంత గూటికి చేరారు.


సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు - పార్టీ శ్రేణుల ఉత్సాహం

జన ప్రభంజనం

వెంకటగిరి/గూడూరు/డక్కిలి, జనవరి 19: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వెంకటగిరిలో శుక్రవారం నిర్వహించిన రా... కదలిరా... బహిరంగ సభ జనప్రభంజనంగా మారింది. టీడీపీ శ్రేణులతో పాటు అభిమానులు, మహిళలు, వృద్ధులు వేలాదిగా తరలివచ్చారు. పట్టణమంతా పార్టీ జండాల రెపరెపలతో పసుపురంగు అలుముకొంది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బొలిగల మస్తాన్‌యాదవ్ ఏర్పాటు చేసిన చంద్రబాబు, నారా లోకేశ్‌ల బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో ఖనిజసంపద ఉన్న నెల్లూరు జిల్లాను అడ్డదిడ్డంగా విభజించి వైసీపీ నాయకులు ఆస్తులు పెంచుకునేందుకు వనరుల దోపిడీకి తెరతీశారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. తెల్ల బంగారంగా చెప్పుకునే క్వార్ట్జ్, సిలికాను దోపిడీ చేసి వేల కోట్లు కొల్లగొట్టారని, ఒక్క సిలికా ద్వారానే రూ.4,500 కోట్లు దోచుకుంటున్నారన్నారు. క్వార్ట్జ్ అక్రమ రవాణాపై తాను దీక్ష చేసినా పట్టించుకున్న నాధుడేలేరన్నారు. క్వార్ట్జ్ టన్నుకు రూ.7 వేల లెక్కన జగన్‌ట్యాక్స్ వసూలు చేశారని ఆరోపించారు. రైతు మంత్రిగా చెప్పుకునే ఆయన అన్నదాతల మెడకు ఉరితాళ్లు తగిలించేలా వ్యవహరిస్తున్నారని మంత్రి కాకాణిపై విమర్శలు గుప్పించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అవినీతి సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలకే మాఫియా పెరిగిపోయిందని, ఈ విషయాన్ని ప్రశ్నించినందుకు సీఎం జగన్ తనపై కక్ష కట్టారన్నారు. వెంకటగిరి అభివృద్ధికి అనేక అంశాలను సీఎంకు విన్నవించినా వాటిని నెరవేర్చకుండా బుట్టదాఖలు చేశారని చెప్పారు. రా.. కదిలిరా.. కార్యక్రమం వైసీపీని తుదముట్టిస్తుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనకు 82 రోజుల్లో ఆయుస్సు ముగియనుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు అనే ఆయుధంతో జగన్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్దంగా ఉండాలన్నారు. మాజీ ఎంపీ పనబాక లక్ష్మి మాట్లాడుతూ ఒక్కఛాన్స్‌తో రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసి అన్ని వర్గాల ప్రజలను వీధులపాలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. యువత, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు ఇలా అందరి కుడుపు కొట్టారని దుయ్యబట్టారు. వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి అంతా టీడీపీ మాయాంలోనే జరిగిందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. వెంకటగిరిలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కాలేజీ, అసంపూర్తిగా వున్న బెల్ కర్మాగారాన్ని పూర్తి చేయడంతో పాటు వెంకటగిరి - కోడూరు రోడ్డు, డక్కిలి మడంలం అల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం పనులు అధికారంలోకి రాగానే పూర్తిచేయాలని కోరారు. గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని, అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేలా చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటారన్నారు. అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అక్రమ సిలికా రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ తిరుమలో వెంకటేశ్వరస్వామి, శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయాల్లో జరుగుతున్న అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి దోషులను శిక్షించాలన్నారు. శ్రీకాళహస్తి ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం జగన్ ప్రజలను నిలువు దోపిడీ చేశారని విమర్శించారు. శ్రీకాళహస్తిలో స్థానిక ఎమ్మెల్యే అవినీతికి అడ్డులేకుండా పోతుందోని ఆగ్రహం వ్యక్తం చేశారు.


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆనం, కురుగొండ్ల సతీమణి సింధు, తానంకి నానాజీ, సన్మానిస్తున్న పనబాక లక్ష్మి


చంద్రబాబుతో మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి, ప్లకార్డులతో మహిళల ఆనందోత్సాహం - పసుపుమయంగా వెంకటగిరి రోడ్డు

ఎర్రచందనం స్మగ్లర్లకు కింగ్‌పిన్ చెవిరెడ్డి


పులివర్తి నాని ఆరోపణ

చిత్తూరు, జనవరి 19:ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లకు కింగ్‌పిన్ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డేనని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని ఆరోపించారు.మృతులు, దొంగ ఓట్లను ముసాయిదా జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఫారం-6, 7, 8 కింద దొంగ ఓట్లను మంత్రి అండదండలతో స్థానిక ఎమ్మెల్యే చేర్పించారని విమర్శించారు. దొంగ ఓట్లపై కేంద్ర ఎన్నికల కమిషన్‌ను చంద్రబాబు కలిసి ఫిర్యాదు చేశారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కడప, నెల్లూరు జిల్లాల్లో ఎర్రచందనం స్మగ్లర్లకు వైసీపీ అధిష్టానం సీట్లను కేటాయించిందని, అలాంటి వారు గెలిచాక ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తారో గమనించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లకు కింగ్‌పిన్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి అని, ఆయన ఆధ్వర్యంలోనే ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎన్నికల ఖర్చులకు నిధులను సమకూర్చుతున్నారని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎర్రచందనం, ఇసుక, మట్టిని దోచుకుని కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారన్నారు. చెవిరెడ్డి దేశంలోనే పేరు గాంచిన ఇండస్ట్రీని చంద్రగిరిలో ఏర్పాటు చేస్తున్నారని, అదే గంజాయి పరిశ్రమ అన్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను బయటపెడతానన్నారు. గతంలో తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో 32వేల దొంగ ఓట్లను చేర్చారని, టీడీపీ, బీజేపీ నాయకుల ఫిర్యాదులతో అప్పట్లో ఈఆర్వోగా ఉన్న గిరీషతోపాటు మరో ముగ్గురిని కూడా కేంద్ర ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిందన్నారు. దొంగ ఓట్లతో గెలిచిన ఎంపీ గురుమూర్తిని కూడా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో దొంగ ఓట్లను చేర్పించిన అధికారులతోపాటు వారిపై ఒత్తిడి తీసుకొచ్చిన స్థానిక ఎమ్మెల్యేలపైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే సీఎం జగన్.. కోడికత్తి శీనును ఎందుకు బెయిల్‌పై విడుదల చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వందలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలను హతమార్చారని, అలాంటి పార్టీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆర్టీసీలో క్యూఆర్‌కోడ్ అమలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 19: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీలో క్యూఆర్ కోడ్(క్యాష్‌లెస్ పేమెంట్)ను అమల్లోకి తెచ్చారు. క్యూఆర్ కోడ్ అమలు కాని కారణంగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై కొన్ని రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో 'ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లో అమలు కాని డిజిటల్ పేమెంట్స్' అన్న వార్త ప్రచురితమైంది. దీనిపై ఆర్టీసీ ఎండీ, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. గత నెల 21న విశాఖపట్నంలోని ద్వారక బస్టేషన్‌లో క్యూఆర్‌కోడ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ఆదరణ లభించడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలుకు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో తిరుపతి సెంట్రల్ బస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో ఈ విధానాన్ని ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన శిరీష క్యూఆర్ కోడ్ ద్వారా మొదటి టిక్కెట్‌ను ఈడీ చేతుల మీదుగా అందుకున్నారు.


సీబీఎస్ రిజర్వేషన్ కౌంటర్‌లో క్యూఆర్ కోడ్ ప్రారంభిస్తున్న అధికారులు

కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం డి.రామచంద్రనాయుడు, కంట్రోలర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీరు, పరిశుభ్రతకు ప్రాధాన్యం

సీఎస్ జవహర్‌రెడ్డి

నేటితో ముగియనున్న హెల్త్ విలేజ్ వర్క్‌షాప్


సదస్సులో మాట్లాడుతున్న సీఎస్ జవహర్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19: గ్రామాల్లో తాగునీరు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. హెల్త్ విలేజ్ అంశంపై పద్మావతి యూనివర్సిటీ వేదికగా చేపట్టిన జాతీయ వర్క్‌షాప్ రెండో రోజైన శుక్రవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. తాగునీరు, పరిశుభ్రత వంటి సమస్యలను గ్రామాలు అధిగమించాలన్నారు. దీనిపై సర్పంచులు దృష్టి సారించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జలజీవన్ మిషన్ ద్వారా ఇప్పటికే ప్రతి ఇంటికీ తాగు నీరు అందిస్తున్నామని చెప్పారు. స్వచ్ఛ భారత్ ద్వారా ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించి ఓడీఎఫ్ ప్లస్‌లోకి వెళ్లామని తెలిపారు. మురికి కాలువల నిర్మాణం వల్ల పంచాయతీలకు నిర్వహణ భారం ఉంటుందని, భూగర్భ డ్రైనేజీ ద్వారా ఎలాంటి సమస్యా ఉండదని పేర్కొన్నారు. రాష్ట్రంలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు. విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ ద్వారా గ్రామీణులకు వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి మాట్లాడుతూ 1.4లక్షల మందికి సచివాలయాల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు అందించామన్నారు. వీరి ద్వారా 88 రకాల ప్రభుత్వ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. చెత్తతో సంపద సృష్టిస్తున్నామన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ టెలి మెడిసిన్‌లో ఏపీ ముందు వరుసలో ఉందన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచామన్నారు. పంచాయతీరాజ్ స్పెషల్ సీఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య విధానం ద్వారా గ్రామీణ స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మాజీ కార్యదర్శి సునీల్‌కుమార్ మాట్లాడారు. సంక్రమిత వ్యాధుల నివారణ, వైద్య సేవలు, జీవన విధానంలో మార్పులు, కుటుంబ నియంత్రణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, అడిషనల్ సెక్రటరీ సీఎస్ కుమార్, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కేటింగ్ రింగ్‌కు భూమిపూజ


స్కేటింగ్ రింగ్‌కు భూమిపూజ చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, జనవరి 19: మున్సిపాలిటీ పరిధిలోని మరాఠీ గేట్ వద్ద స్కేటింగ్ రింగ్‌కు శుక్రవారం మంత్రి రోజా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు నియోజకవర్గంలో ఆధునిక వసతులతో జిమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగానే శాప్ నిధులు రూ.78 లక్షలతో స్కేటింగ్ రింగ్ ఏర్పాటు పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు తన చారిటబుల్ ట్రస్టు ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీవోలు సయ్యద్ సాహెబ్, బాలాజీ, ఆర్‌అండ్‌బీ డీఈ అమరనాథరెడ్డి, ఏఈ గిరీష్, వైసీపీ నాయకులు మాహీన్, జయప్రకాష్, రమేష్‌బాబు, బాలసుబ్రహ్మణ్యం, చక్రపాణి పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

చంద్రబాబు సభకు తరలిన టీటీడీ నేతలు


వెంకటగిరి సభలో వడమాలపేట మండల నేతలు

వడమాలపేట, జనవరి 19: వెంకటగిరిలో శుక్రవారం జరిగిన రా.. కదిలిరా.. సభకు నగరి నియోజకవర్గం నుంచి టీడీపీ నేతలు తరలివెళ్లారు. వడమాలపేట మండలం నుంచి ధనంజయులు నాయుడు, దాము యాదవ్, వెంకటేశ్వర యాదవ్, పట్టాభి, బత్తినాయుడు, దేవ, గురవయ్య, శివరాయల్, మురళీ ఆచారి, అనంతసేన నాయుడు, మణిరాజు తదితరులు వెళ్లారు.

నారాయణవనం: మండలం నుంచి టీడీపీ నేతలు భాస్కర్, గిరిబాబు, రవి, బాలసుబ్రహ్మణ్యం, కందస్వామి, వేలురెడ్డి, దామోదరంరెడ్డి, దానవేలు, సుబ్రహ్మణ్యం, కుమార్, గోపి, ప్రేమ్‌కుమార్, దయా తదితరులు వెళ్లారు.

టెర్మినేషన్ నోటీసులు చట్ట విరుద్ధం: సీఐటీయూ

పుత్తూరు, జనవరి 19: అంగన్వాడీలకు టెర్మినేషన్ నోటీసులు ఇవ్వడం చట్ట విరుద్ధమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ అన్నారు. పుత్తూరు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న దీక్ష 39వ రోజుకు చేరింది. శుక్రవారం దీక్షా శిబిరం నుంచి ర్యాలీగా కార్వేటినగరం కూడలి వద్దకు వెళ్లి అక్కడ వున్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మూడు నెలలకు ముందే రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులకు సమ్మె నోటీసులు అందించామని గుర్తు చేశారు. అయినా అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపు ధోరణిలో టెర్మినేషన్ నోటీసులు ఇవ్వడం చట్ట విరుద్ధమన్నారు. కార్యక్రమంలో మునికుమారి, విజయకుమారి, మోహన్‌లక్ష్మి, ధనమ్మ, రాధ, లలిత, పూర్ణ, సుమతి, హైమావతి పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న అంగన్వాడీలు

ఉపాధ్యాయులకు బకాయిలను చెల్లించండి


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పుత్తూరు టౌన్, జనవరి 19: ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌డీఎం థియేటర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ నాలుగన్నరేళ్లుగా ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఇప్పటికి రూ.21 వేల కోట్లు ప్రభుత్వం బకాయి ఉందని, వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు పీఎఫ్, ఏపీజీఎల్ఐ రూపంలో దాచుకున్న నగదును తమ అవసరాల కోసం తీసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయిలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు కందల శ్రీదేవి, జిల్లా కార్యదర్శి శేఖర్, గీతమ్మ, నాయకులు భాస్కర్, సురేష్, నరేష్, నరసింహ, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



నాగలాపురం తూర్పు దళితవాడలో చింతామోహన్ ప్రచారం

తిరుపతి నుంచి చిరంజీవి పోటీ చేయాలి

● మాజీ ఎంపీ చింతామోహన్

సత్యవేడు/నాగలాపురం/వరదయ్యపాళెం/తొట్టంబేడు, జనవరి 19: కాపు, బలిజల రాజ్యాధికార ఆకాంక్ష నెరవేరాలంటే మాజీ కేంద్రమంత్రి, సినీ నటుడు చిరంజీవి తిరుపతి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయాలని మాజీ ఎంపీ చింతామోహన్ కోరారు. సత్యవేడు మండలం సిరుణంబుదూరు దళితవాడలో శుక్రవారం చింతామోహన్ మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తంతో కలసి ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ కరపత్రాలను పంచిపెట్టారు.

అనంతరం నాగలాపురం తూర్పు దళితవాడ, వరదయ్యపాళెంలో చింతా మోహన్ ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ జనరల్ కార్యదర్శి సింధూజ, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి తేజ, మండల మహిళా అధ్యక్షురాలు ప్రేమ, నాయకులు డాక్టర్ దామోదరం, జ్ఞానకన్ను, ఆరుముగం, గోవింద స్వామి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీకాళహస్తి పట్టణంలోని బేరివారి మండపం నుంచి శుక్రవారం మార్పుకావాలి..కాంగ్రెస్ రావాలి కార్యక్రమాన్ని చింతా మోహన్ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలుపంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలు తేజోవతి, నాయకులు గోపిగౌడ్, వెంకటేష్‌గౌడ్, నరేంద్రనాయుడు, మహేష్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 19: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనక దుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాల సమయంలో అమ్మవారి మూలమూర్తికి విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారి ఆలయంలో దీపారాధన, సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి జనవరి 19: విద్యుత్ ప్రధాన కేంద్రంలో మరమ్మత్తులు కారణంగా శనివారం సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ వాసు రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. శ్రీకాళహస్తి విద్యుత్ కేంద్రం పరిధిలోని టౌన్, రూరల్, తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ, ఏర్పేడు, కే.వి.బిపురం మండలాల్లో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రికెట్ మండల విజేతగా కారూరు టీం

పిచ్చాటూరు, జనవరి 19: ఆడుదాం ఆంధ్రలో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో కారూరు సచివాలయ జట్టు మండల విజేతగా నిలిచినట్టు ఎంఈవో యుగంధర్ రాజు తెలిపారు. ఐసీసీ ఇందిరానగర్ క్రికెట్ మైదానంలో శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో కారూరు జట్టు గెలిచినట్టు ప్రకటించారు.

టీడీపీ నాయకుడిపై అట్రాసిటీ కేసు

ఏర్పేడు, జనవరి 19: మండలంలోని మడిబాక మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు రాయపనేని మల్లికార్జున్‌నాయుడిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మల్లికార్జున్‌నాయుడు ఇంటి వద్ద పనిచేస్తోన్న మడిబాక గ్రామానికి చెందిన చాముండేశ్వరి తనను కులం పేరుతో దూషించాడని పోలీసులకు గురువారం సాయంత్రం ఫిర్యాదు చేయడంతో అతడిపై సీఐ శ్రీహరి అట్రాసిటీ కేసును నమోదు చేశారు.

భూ వివాదంలో ఆరుగురికి జైలు శిక్ష

● తీర్పు వెలువరించిన న్యాయమూర్తి



జైలు శిక్ష పడిన నిందితులతో పోలీసులు

నాగలాపురం, జనవరి 19: ఇరువర్గాల మధ్య జరిగిన భూవివాద కేసులో ఓ వర్గానికి చెందిన ఆరుగురికి ఏడాది జైలు శిక్ష పడింది. దీనికి సంబంధించి నాగలాపురం ఎస్ఐ ఓబయ్య తెలిపిన వివరాల మేరకు... 2017వ సంవత్సరంలో నాగలాపురం మండల పరిధిలోని కారణి గ్రామానికి చెందిన దయానిధి భార్య అనురాధ ఆ గ్రామంలోని తన పొలాల్లో బోరు వేయడానికి వెళ్లగా సమీప పొలంలో అదే గ్రామానికి చెందిన రూపేష్ అతని వర్గీయులు ఆరుగురు కలిసి పొలానికి వెళ్లడానికి దారిలేదని అనురాధను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. ఈ వివాదంలో రూపేష్ అతడి వర్గీయులు సత్యమూర్తి, బాబు, అరవింద్, దేవయ్య, బద్రి కలిసి అనురాధపై దాడి చేశారు. దీంతో బాధిరాలు అదే రోజు నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ మునస్వామి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఏడు సంవత్సరాలుగా ఏపీపీ ప్రశాంతి ఆధ్వర్యంలో సత్యవేడు కోర్టులో ఈ కేసు నడుస్తోంది. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలను కోర్టు కానిస్టేబుల్ తంబురాజు న్యాయమూర్తికి అందించగా గురువారం తుదిదశకు చేరుకుంది. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం ఆరుగురు నిందితులకు ఏడాది జైలు, ఒక్కొరికి 1000 రూపాయలు జరిమాన విధిస్తూ సత్యవేడు కోర్టు ఇంచార్జి న్యాయమూర్తి గోపాల కృష్ణ గురువారం తీర్పు వెలువరించారు.

అరుణానది కాజ్‌వేకు మరమ్మతులు పూర్తి



కాజ్‌వే రహదారిపై రాజశేఖర్‌కు అభినందనలు తెలుపుతున్న స్థానికులు

పిచ్చాటూరు, జనవరి 19: మండలంలోని ఓబుల్‌రాజు కండ్రిగ వద్ద అరుణానదిపై ఉన్న లో లెవెల్ కాజ్‌వే ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీని మరమ్మతులు చేపడతానని హామీ ఇచ్చిన టీడీపీ నాయకుడు జేడీ రాజశేఖర్ రెండు రోజులుగా మరమ్మతు పనులు పూర్తి చేసి శుక్రవారం సాయంత్రానికి రాకపోకలను పునరుద్ధరణ చేయించారు. దీంతో స్థానికులు పెద్ద సంఖ్యలో బ్రిడ్జి వద్దకు వచ్చిన ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

శ్రీకాళహస్తి, జనవరి 20: విద్యుదాఘాతంతో మద్దూరు వెంకటరామయ్య (37)అనే ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. శ్రీకాళహస్తి మండలం ముచ్చువోలు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంపై బంధువుల కథనం మేరకు వివరాలిలా...అదే గ్రామానికి చెందిన వెంకట రామయ్య ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు.. పట్టణంలో పని ముగించుకుని రాత్రి ఇంటికి చేరుకున్న అతనికి ఇంట్లో ఓ లైటు వెలగకపోవడంతో దాని హోల్డర్ సరిచేసే క్రమంలో విద్యుత్ షాక్ తో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కాగా మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబంలో పెద్దదిక్కు కోల్పోవడంతో వారంతా బోరున విలపిస్తున్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

అంబేడ్కర్ విగ్రహానికి అంగన్‌వాడీల వినతి

సత్యవేడు, జనవరి 19: తమ డిమాండ్లు పరిష్కరించాలని గత నెల రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం సమ్మెలో భాగంగా సత్యవేడు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాజ్యాంగ, కార్మిక హక్కులను కాలరాస్తూ డాక్టర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా, మెమో, టెర్మినేషన్ అనే పదజాలంతో సీడీపీవో అధికారుల ద్వారా బెదిరిస్తున్నారని, వాటికి భయపడకుండా రాజ్యాంగ హక్కు స్ఫూర్తితో న్యాయం జరిగే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకుడు మురళి, అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ సభ్యులు నిర్మల, ఝాన్సీ, శాంతి, భారతి, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: రాష్ట్రంలో అంగన్‌వాడీలను వీధులపాలు చేయడం మహిళా సాధికారతా జగనన్నా..అని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ నాయకులు ధనమ్మ, భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. శుక్రవారం సమ్మెలో భాగంగా తిరుపతి రోడ్డులోని చేపల మార్కెట్ వద్దఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ కట్టించారు కానీ 39 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే దృష్టి సారించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు విజయలక్ష్మి, అంబిక, పార్వతి, లక్ష్మీ, ప్రభావతి, పాండురంగమ్మ, భారతి, రాధమ్మ, విజయతో పాటు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



రేణిగుంటలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

టీడీపీ గాలికి వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం

సత్యవేడు, జనవరి 19: రాష్ట్రంలో టీడీపీకి వీస్తున్న గాలిలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి డా. హెలెన్ పేర్కొన్నారు. వెంకటగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన రా కదలిరా కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా తన నివాసంలో శుక్రవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన

శ్రీకాళహస్తి, జనవరి 19: పోరాటాలతోనే కార్మికుల హక్కుల సాధన సాధ్యమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక విధానాలను ప్రతి ఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనామాల గురవయ్య, పట్టణ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వరదయ్యపాళెం, జనవరి 19: మండలంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వరదయ్యపాళెం పోలీసుల కథనం మేరకు వరదయ్యపాళెం పంచాయతీ గోపాలరావు కాలనీకి చెంది. వినయ్ అనే యువకుడు ఇద్దరు బాలురతో కలిసి ద్విచక్ర వాహనంపై తడ నుంచి కడూరు ఎస్సీకాలనీ వద్ద సత్యవేడు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారి వాహనాన్ని మినీ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గరికి తీవ్రగాయాలు అయ్యాయి. వారిని 108 వాహనం ద్వారా తిరుపతికి తరలించారు. పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు.

ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

● యుటిఎఫ్ డిమాండ్

శ్రీకాళహస్తి, జనవరి 19: ఉద్యోగులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. యుటీఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ విధి విధానాలు ప్రకటించకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని మండిపడ్డారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మోహన్ బాబు, వెంకట కృష్ణ, విజయ్ కుమార్, జిల్లా సీనియర్ నాయకులు శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ సభ్యులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అంతంతోనే భవిష్యత్తు: జనసేన

శ్రీకాళహస్తి, జనవరి 19: ప్రజలను పీడిస్తున్న వైసీపీ అంతంతోనే రాష్ట్రానికి భవిష్యత్తు సాధ్యమని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి వినుత పిలుపునిచ్చారు. పట్టణంలోని 10వ వార్డు పరిధిలో శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఉపాధ్యక్షుడు రవికుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాఘవయ్య, తొట్టంబేడు మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 19: మండలంలోని నెలవాయి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిన ట్యాబ్‌లను హెచ్ఎం రాజశేఖర్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు







ముక్కంటి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు - ద్వారక తిరుమల ఈవో త్రినాథ రావు - బేరనా దీక్షిత్

శ్రీకాళహస్తి, జనవరి 19: ముక్కంటి ఆలయాన్ని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఐఏఎస్ అధికారి బేరనా దీక్షిత్, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పంచాయితీ రాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాజశేఖర్, ద్వారక తిరుమల ఈవో త్రినాధ రావు వేరువేరుగా ఆలయానికి విచ్చేశారు. అధికారులు వారికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పొగ నియంత్రణ యంత్రాల వితరణ

శ్రీకాళహస్తి, జనవరి 19: ముక్కంటి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు పొగ నియంత్రణ యంత్రాలను వితరణ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆలయంలోని పరిపాలనా భవనంలో ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దాత మోహన్ రావు మాట్లాడుతూ... ఆలయంలోని చండీ, రుద్ర హోమం మండపాల్లో పొగ స్తంభించకుండా భక్తుల సౌకర్యార్థం రూ.80వేల విలువైన పరికరాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఛైర్మన్‌కు పరికరాలను అందజేస్తున్న దాతలు

డివైడర్‌ను ఢీకొన్న కారు

● ఒకరి మృతి ● నలుగురికి గాయాలు

ఏర్పేడు, జనవరి 19: అదుపు తప్పి డివైడరును కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురికి స్వల్పగాయాలైన ఘటన శుక్రవారం తెల్లవారుజామున ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీహరి కథనం మేరకు వివరాలిలా... బాపట్ల జిల్లా కుమ్మరిపాళెం గ్రామానికి చెందిన వాసుదేవరావు(49) కంటికి శస్త్ర చికిత్స చేయించుకునేందుకు తిరుపతిలోని అరవింద్ ఆస్పత్రికి గురువారం రాత్రి కారులో బయలుదేరాడు. అతని వెంట భార్య భారతి, కుమారుడు శివరామకృష్ణ, బావమరిది తులసీరామ్, సమీప బంధువు హేమంత్ కారులో బయలుదేరారు. మార్గమధ్యలో ఏర్పేడు మండలం జంగాలపల్లి క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న గేదెను తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వాసుదేవరావు అక్కడికక్కడే మృతి చెందగా అతడి భార్య భారతి సహా కారులో ఉన్నవారు గాయపడ్డారు. స్థానికులు వీరిని గుర్తించి 108 వాహనం ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఏర్పేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాసుదేవరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



డివైడరును ఢీకొని నుజ్జునుజ్జయిన కారు - ఇన్‌సెట్‌లో మృతుడు వాసుదేవరావు (ఫైల్‌ఫొటో)

ఆలయ శుద్ధితో మహా పుణ్యం



ఆంజనేయస్వామికి పూజలు చేసిన బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 19: ఆలయ శుద్ధితో మహాపుణ్యం ప్రాప్తిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణ శివారులోని బంగారమ్మ ఆలయాన్ని శుక్రవారం బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. అనంతరం సంకట విమోచన ఆంజనేయ స్వామి సన్నిధిని శుభ్రం చేశారు. అలాగే ఆంజనేయ స్వామి మూర్తిని అభిషేకించి రామనామ సంకీర్తనతో పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం రెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా సభ్యులు రమణ, పట్టణ అధ్యక్షులు రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, పట్టణ కార్యదర్శి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న మిద్దెల హరి

శ్రీకాళహస్తి, జనవరి 19: అంతరాష్ట్ర అబాకస్‌లో శ్రీకాళహస్తికి చెందిన పవన్ కుమార్ అనే విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. పట్టణానికి చెందిన భాస్కర్, శాంతి దంపతుల కుమారుడు పవన్ కుమార్ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. అబాకస్ మేథమెంటల్స్ పేరుతో చెన్నైలో ఇటీవల అంతరాష్ట్ర పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థి పవన్ కుమార్ మొదటి బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా మాజీ అప్కో డైరెక్టర్, స్కిమ్స్ విద్యాసంస్థల అధినేత మిద్దెల హరి తన కార్యాలయంలో విద్యార్థిని శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయస్థాయిలో శ్రీకాళహస్తి ఖ్యాతి చేరడం గర్వకారణం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆసక్తికర రంగాలపై ప్రోత్సహించాలని చెప్పారు.

అభివృద్ధి పనుల పరిశీలన

శ్రీకాళహస్తి, జనవరి 19: ముక్కంటి ఆలయం ద్వారా జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ధర్మకర్తల మండల చైర్మన్ అంజూరు శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా అనుబంధ ఆలయాలైన మార్కండేయ తీర్థ, ఏడు గంగమ్మ గుడి, గిరి ప్రదక్షిణ మార్గంలోని 5నూతన విడిది మండపాల నిర్మాణ పనులను పరిశీలించారు. వెయ్యి లింగాల కోనలోని దుర్గా మల్లేశ్వర ఆలయానికి త్వరలో కుంభాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి ప్రవేశించిన కొండచిలువ



శ్రీకాళహస్తి జనవరి 19: భారీ కొండచిలువ ఇంట్లోకి చొరబడడంతో కలకలం రేగింది. ఈ ఘటన శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణ శివారులోని కైలాసగిరి కాలనీలో చోటు చేసుకుంది. కాలనీలోని ఓ ఇంట్లో భారీ కొండ చిలువ వెలుగు చూడడంతో స్థానికులు హడలి పోయారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ ఉద్యోగి దాము ఘటనా స్థలానికి చేరుకుని, చాకచక్యంగా దానిని పట్టుకుని రామాపురం అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

రోడ్డు దాటుతున్న గేదెలను డీకొన్న తమిళనాడు బస్సు

ఏర్పేడు, జనవరి 19: మండలంలోని సీతారాంపేట సమీపంలో రోడ్డు దాటుతున్న మూడు గేదెలను తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న తమిళనాడు బస్సు శుక్రవారం సాయంత్రం ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా ఒక గేదె బతికి బయటపడింది. సమాచారం తెలుసుకున్న ఏర్పేడు పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అందరి కళ్లూ ఆ భూమిపైనే...

ఏర్పేడు, జనవరి 19: మండలకేంద్రంలో ఐఐటీ వద్ద మేర్లపాక సర్వే గ్రూప్ సర్వే నెంబరు 2లో కొంత భూమిని తమకు ఇంటి స్థలాలుగా ఇచ్చారంటూ మేర్లపాక దళితవాసులు శుక్రవారం ఎక్స్‌కవేటర్ సాయంతో చదును చేశారు. అయితే అదే క్రమంలో ఆ భూమిపై తనకు పట్టా ఉందని ఏర్పేడు మండలం బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన ఓ రైతు అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఐఐటీ వద్ద ఎకరా రూ.6కోట్లు పలుకుతోంది. దీంతో అందరి కళ్లు ఆ భూమిపైనే. అయితే ఒకే భూమికి 20 ఏళ్ల క్రితం మేర్లపాక దళితులకు ఇంటి పట్టాలు, మరొకరికి మూడు సెంట్లు చొప్పున 20మందికి పంచారంటూ చదును చేయడం ఓ పక్క, బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన ఓ రైతు తమ పేరిట పట్టా ఉందని చెబుతున్నాడు. ఏది వాస్తవమో ఏది అవాస్తవమో రెవెన్యూ అధికారులు తేల్చాల్సి ఉంది. కాగా ఈ భూమి ఆన్‌లైన్‌లో అనాధీనం అని చూపిస్తోంది.



చదును చేసిన సర్వే నెంబరు 2లోని భూమి

అంగన్వాడీలకు అండగా రాస్తారోకో

శ్రీకాళహస్తి, జనవరి 19: అంగన్వాడీలకు అండగా శనివారం శ్రీకాళహస్తిలో రాస్తారోకో నిర్వహించనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల కోసం 39 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించినట్లు తెలిపారు. కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య, పట్టణ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను స్మరించే అర్హత జగన్‌కు లేదు

శ్రీకాళహస్తి, జనవరి 19: భారత రాజ్యాంగాన్ని కాకుండా, తన సొంత విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తున్న సీఎం జగన్‌కు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ పేరు తలచే అర్హత లేదని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు శ్రీకాళహస్తి ఐసీడీఎస్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి అంబేడ్కర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడి నాయకులు రేవతి, శోభ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వేమన పద్యాల్లో జీవిత సత్యం

శ్రీకాళహస్తి, జనవరి 19: యోగి వేమన పద్యాలతో ప్రజలకు జీవిత సత్యాలను బోధించారని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ట్రస్టు నాయకులు అన్నారు. పట్టణంలోని వైయస్సార్ కూడలి వద్ద శుక్రవారం యోగి వేమన 612వ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి, అనంతరం యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెంచు రెడ్డి, కన్నలి ప్రభాకర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.